సీఎం కేసీఆర్ చొరవతో విశ్వనగరంగా హైదరాబాద్



ఆర్‌కేపురం గ్రీస్ టవర్స్ అపార్ట్‌మెంట్‌వాసులతో మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మంత్రి సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: సీఎం కేసీఆర్ నేతృత్వంలో మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో గ్రేటర్ హైదరాబాద్ విశ్వనగరంగా మారుతుందని విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఆర్‌కే పురం హరిపురికాలనీ రోడ్ నెంబర్-1లో గ్రీస్ టవర్స్ అపార్ట్‌మెంట్స్ వాసులతో ఆత్మీయ సమావేశంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. 9 ఏళ్ల కిందట ఎల్‌బీనగర్ ప్రాంతం ఎట్లుండెనో ఇప్పుడు ఎలా మారిందో చూస్తేనే నగర అభివృద్ధి తెలుస్తుందన్నారు. అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్‌లు, వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి తదితర కార్యక్రమాలతో రానున్న కాలంలో పెరగనున్న జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకొని చేపట్టడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మెట్రో విస్తరణతో అభివృద్ధి శరవేగంగా జరగనుందని, శివారు ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు మరింతగా మెరుగుపడతాయన్నారు. పనిచేసి మీ ముందుకు వచ్చాను.. ఆశీర్వదించి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయనంద్ గుప్తా, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, మురుకుంట్ల అరవింద్‌శర్మ, పెండ్యాల నగేష్, సాజీద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహం.. సదర్ సమ్మేళనం



సదర్ సమ్మేళనంలో దున్న రాజాల విన్యాసాలు



మన్సూరాబాద్ చౌరస్తాలోని సదర్ సమ్మేళనానికి హాజరైన దున్న రాజాలు



మన్సూరాబాద్: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ చౌరస్తాలో సదర్ సమ్మేళనానం ఆదివారం రాత్రి ఉత్సాహంగా జరిగింది. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, టీపీసీసీ నేతలు మధుయాష్కి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా దున్న రాజాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దున్న రాజాలతో హాజరైన వారికి మెమెంటులు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పోచబోయిన గణేష్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్, నాయకులు జగదీష్‌యాదవ్, బొల్లు యాదయ్యయాదవ్, మల్లేల శ్రీనివాస్ యాదవ్, కేశబోయిన రవియాదవ్, శ్రీకాంత్ యాదవ్, నగేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల తిరస్కరణ

చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గంలో అసెంబ్లీ స్థానానికి వేసిన నామినేషన్లలో ఐదింటిని తిరస్కరించినట్లు ఆర్‌ఓ వెంకట ఉపేందర్ రెడ్డి తెలిపారు. మొత్తం 32 నామినేషన్లు రాగా సోమవారం నామినేషన్ల పరిశీలన అనంతరం ఐదు నామినేషన్లు తిరస్కరించినట్లు తెలిపారు. తిరస్కరణకు గురైన అభ్యర్థుల వివరాలు..

- **సయ్యద్ మినాజ్:** ఎంఐఎంకు డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఒక్క ప్రపోజల్ వేయడంతో నామినేషన్‌ను తిరస్కరించారు.
- **నయీం సుల్తానా:** ప్రపోజల్స్, అఫిడవిట్ సరిగా లేని కారణంగా తిరస్కరించారు.
- **గంటి శ్రీనివాస్:** అఫిడవిట్ ఫాంలో సంతకాలు చేయని కారణంగా తిరస్కరించారు.
- **టి.రాధ:** ప్రపోజల్స్ 10 మందికి గానూ 9 మందిని చూపడంతో తిరస్కరణ.
- **మహ్మద్ మాజిద్:** అఫిడవిట్లో సంతకాలు చేయని కారణంగా తిరస్కరించారు.

ఎల్‌బీనగర్‌లో అయిదు..

చైతన్యపురి: నామినేషన్ల ప్రక్రియలో ఎల్‌బీనగర్‌లో దాఖలైన అయిదుగురి నామినేషన్లను తిరస్కరించనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పంకజ తెలిపారు. సోమవారం జరిగిన నామినేషన్ల స్క్రూటినీలో తిరస్కరించిన అభ్యర్థుల వివరాలను వెల్లడించారు. స్వతంత్ర అభ్యర్థి దేవుల పల్లి రాజయ్య, కొండా శ్రీనివాసచారి, పూజ సామల అనే అభ్యర్థుల ఎక్ట్రాక్ట్ ఎలక్ట్రోరల్ రోల్ కాపీ సమర్పించని, ప్రతిపాదకుల వివరాలు ఓటర్ల జాబితోలో సరిపోలకపోవటటం వల్ల తిరస్కరించారు. అలాగే అన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాల్వాయి వేణు, గుణ సురక్ష పార్టీ ధనావత్ రాజ్‌కుమార్ నాయక్ పది మంది ఓటర్లు ప్రతిపాదించకపోవటం వల్ల వారి నామినేషన్లు తిరస్కరించినట్లు ఆర్‌ఓ తెలిపారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్లు ఎవరివి కూడా తిరస్కరణకు గురికాకపోవటం గమనార్హం. మొత్తం దాఖలు అయిన 87 నామినేషన్లలో ఒకటికి నామినేషన్లలో ఒకటి మాత్రమే పరిగణలోకి తీసుకోగా తిరస్కరించిన నామినేషన్లు పోగా 57 నామినేషన్లను స్వీకరించారు.

24గంటల కరెంట్ కావాలా..
3 గంటలే కావాలా..?



ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌రెడ్డి



ప్రచారం చేస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: బీఆర్ఎస్ పార్టీ ఇస్తున్న 24గంటల కరెంట్ కావాలా లేదా కాంగ్రెస్ పార్టీ 3 గంటలే కావాలో ప్రజలు ఆలోచించకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో స్థానిక నాయకులతో కలిసి సుధీర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 58,59 జీఓ ద్వారా పేదలకు పట్టాలు ఇప్పించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని, బస్తీల్లో సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మధుయాష్కి దొంగ వేషాలు, నకిలీ పత్రాలు సృష్టించి ఎంతోమందిని మోసం చేశారని అలాంటి వారిని నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. నియోజకవర్గంలో బలమైన క్యాడర్ లేకున్నా పోటీ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ ఓటు వేయాలని, అప్పుడు తెలంగాణ రాష్ట్రం, ఎల్‌బీనగర్ నియోజకవర్గం మరింత ముందుకు వెళ్తుందని సూచించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఇస్తానని చెప్పి హామీలను ఇవ్వకుండా ప్రజలను మోసం చేసిందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే అక్కడ కాంగ్రెస్ చిత్తుగా ఓడి పోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెరుకు సంగీత ప్రశాంత్‌గౌడ్, నాయకులు అనంతుల రాజీరెడ్డి, తూర్పాటి చిరంజీవి, సుర్వి రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో..

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు కాలనీల ఆత్మీయ సమ్మేళనలలో ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొని ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, కుంట్లూరు వెంకటేశ్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీప్రసన్నగౌడ్, అనిల్‌చౌదరి, మాధవరం నర్సింహరావు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు.. (కిలో రూపాయల్లో) టమాట 25, వంకాయ 13, బెండ 28, పచ్చి మిర్చి 35, కాకర 16, బీర 23, క్యాబేజి 13, ఫ్రెంచిబీన్స్ 60, క్యారెట్ 37, దొండ 13, చిక్కుడు 28–45, గోకర 28, బీట్‌రూట్ 25, క్యాప్సికం 35, ఆలు 21, దోస 18, సొర 7, పొట్ల 11, ఉల్లిగడ్డ 40, చామగడ్డ 35 గమనిక: ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఆర్థిక సాయం

గౌతంనగర్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వై.కే.రాకేష్ కుటుంబానికి గౌతంనగర్ డివిజన్ హనుమాన్‌పేట్‌కు చెందిన ది సిటిజన్ బ్యాంక్ కో-ఆపరేటివ్ సొసైటీ మేనేజర్ ఎస్.ఎమ్ ఫీరాన్ సోమవారం రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఏవీ.స్వామి, రాజేశ్వర్‌రావు, సిబ్బంది అనిల్, ప్రియాంక, దినేష్, హర్ష తదితరులు ఉన్నారు.

ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్

సంతోష్‌నగర్: ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్‌రెడ్డి సూచించారు. ఎన్నికలను పురస్కరించుకొని కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్, సీ-బ్లాక్, హెచ్-బ్లాక్, బీ-బ్లాక్ తదితర ప్రాంతాల్లో సిటీ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, కంచన్‌బాగ్ పోలీసులతో ఫ్లాగ్ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..ప్రజలకు తాము ఉన్నామంటూ భరోసా కల్పించేందుకు ఈ ఫ్లాగ్ మార్చ్‌లను నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా నిర్భయంగా తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. రౌడీషీటర్లు ఎన్నికల సమయంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూదన్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు సాహిత్య కళాపీఠం 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ..వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి వారికి పురస్కారాలను ఇవ్వడం ఎంతో ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా రచయిత ఈటల సమ్మన్న రచించిన సత్యదర్శనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కవి సమ్మేళనం ఆకట్టుకున్నాయి. నేషనల్ బుక్ ట్రస్ట్ తెలుగు సంపాదకులు పత్తిపాక మోహన్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్, నేటినిజం పత్రికా సంపాదకులు బైస దేవదాస్, కళాపీఠం వ్యవస్థాపకులు చిక్కా రామ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని చిక్కడపల్లి ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు సింగారపు రమేష్‌గుప్తా అన్నారు. సోమవా రం చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వివేక్ నగర్ శ్రీ ఆంజనే య స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మరేష్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్నదానాల్లో కన్నా అన్నదానం గొప్పదన్నారు.

నేటి నుంచి కార్తీకమాస పవిత్రోత్సవాలు

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీక మాస పవిత్రోత్సవాలు మంగళవారం నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ఈవో మాచర్ల దేవనాధం, పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ బాసాని పద్మ తెలిపారు. రోజూ ఉదయం 7 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకాలు, సాయంత్రం ఆకాశ దీపోత్సవం ఉంటుందన్నారు. ప్రతి సోమవారం ఏకాదశ రుద్రాభిషేకాలు ఉంటాయన్నారు. మంగళవారం నుంచి, 12 వరకు, డిసెంబర్ 4న సాయంత్రం ప్రదోషకాల పూజ, ఈ నెల 24న శ్రీకృష్ణతులసి కల్యాణం, 25న శని తిల తైలాభిషేకాలు, 26న జ్వాలాతోరణ, సహస్ర దీపాలంకరణ, 30న అరుద్ర నక్షత్రం పురస్కరించుకుని రుద్రహోమం, డిసెంబర్ 11న సాయంత్రం శ్రీ శివకల్యాణోత్సవం ఉంటుందని వివరించారు.

నేడు 'కామినేని'లో షుగర్ వ్యాధి ప్రత్యేక క్యాంపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్ వైద్యులు

మన్సూరాబాద్: ప్రపంచ మధుమేహ (షుగర్) వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఇందిరా ఆడిటోరియంలో మధుమేహ వ్యాధిపై ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ సీనియర్ ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ సందీప్‌రెడ్డి తెలిపారు. సోమవారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో క్యాంపు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ క్యాంపు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. రూ.3640 విలువైన డయాబెటిస్ అసెస్‌మెంట్ ప్యాకేజీ కేవలం రూ.500లకే ఇవ్వటమే కాకుండా నిపుణులైన వైద్యులు పరీక్షించి సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డయాబెటలజిస్ట్ డాక్టర్ భవానీ పాల్గొన్నారు.

మంత్రి సబితారెడ్డిని ఓడిస్తాం



ప్రసంగిస్తున్న కేఎల్‌ఆర్

కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్‌ఆర్

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీని మోసం చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి సబితా రెడ్డిని ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్‌ఆర్) పిలుపునిచ్చారు. సోమవారం మండల పధిలోని నాగారం, నందుపల్లి, పెద్దతండా, ఎన్మగెర్వుతండా, ఎన్టీఆర్‌తండా, నాగిరెడ్డిపల్లి, పులిమక్త, గొల్లూరు, అమీర్‌పేట్, పెద్దమ్మతండా, నల్లచెర్వుతండా, మాణిక్యమ్మగూడ, కేబీతండా, జాండగూడ, గాంధీనగర్, దుబ్బచర్ల, కల్వకోల్, పెండ్యాల, రామచంద్రగూడ, మన్సాన్‌పల్లి చౌరస్తా, డబిల్‌గూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతోందని, వచ్చే ఎన్నికల్లో 80 స్థానాలకుపైగా దక్కించుకుని, అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ఆరు గ్యారంటీ పథకాల అమలు చేస్తామని తెలిపారు. పేదల సంక్షేమాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. మహేశ్వరం మండలంలోని మన్సాన్‌పల్లి, మంఖాల్, సర్దార్‌నగర్‌లో నిర్మించిన చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్లను స్థానికులకు కేటాయించకుండా, స్థానికేతరులకు మంత్రి పంపిణీ చేశారని విమర్శించారు.

ఇంటింటి ప్రచారం..

అంతకు ముందు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, అమీర్‌పేట్ మాజీ ఎంపీటీసీ తొంట రాములు కేఎల్‌ఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామాల్లో తండాల్లో కేఎల్‌ఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత రెడ్డి, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే యూసుఫ్ అలీ, పార్టీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్, మాజీ ఎంపీపీలు కోరుపోలు రఘుమారెడ్డి, పాండునాయక్, మాజీ మండల అధ్యక్షుడు కావలి దశరథ, పార్టీ సీనియర్ నాయకులు యాదయ్య, సత్యనారాయణరెడ్డి, కృష్ణనాయక్, పాండునాయక్, లాజర్, నారాయణ, ప్రవీణ్, రాజునాయక్, శ్రీనివాస్ గౌడ్, చంద్రమోహన్, హరినాద్‌గౌడ్, చంద్రమోహన్, రాజు, ప్రవీణ్, రఘుపతి, బాల్‌రాజ్, అంజయ్య, రాజు, రాజేందర్, యాదయ్య పాల్గొన్నారు.

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం



కొత్తపేట డివిజన్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్

మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: మూసీనదిపై నిర్లక్ష్యంతో నియోజకవర్గం కంపు కొడుతోందని, కబ్జాదారుల చెరనుంచి విముక్తి కల్పించడానికి కొత్తపేట ప్రజలు పూనుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం అభ్యర్థి మధుయాష్కీగౌడ్ అన్నారు. సోమవారం మధుయాష్కీగౌడ్ కొత్తపేట మారుతీనగర్‌లో హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించి మారుతీనగర్ నుంచి స్నేహపురి కాలనీ వరకు పాదయాత్రతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హయత్‌నగర్ గల్లీ నుంచి ఢిల్లీకి ఎదిగిన తాను సాధ్యమైనన్ని నిధులు తీసుకువచ్చి ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని ఆవాసయోగ్యంగా, ఆదర్శ, ఆరోగ్య నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, లింగాల కిశోర్‌గౌడ్, షరీఫ్, టీజేఎస్ నాయకులు పల్లె వినయ్, రంగారెడ్డి, మహిళా నాయకురాళ్లు సుజాత రెడ్డి, రజిని, పుష్పలత, రాణి, శైలజరెడ్డి, యూత్ నాయకులు అబ్దుల్‌కరీం, చిన్నాగౌడ్, సాయి పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరికలు

మన్సూరాబాద్ డివిజన్ బాల్‌రెడ్డినగర్‌లో జక్కిడి శివసేనారెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 100 మంది యువకులు మధుయాష్కీగౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని, ఇది సోనియమ్మ మాట అని మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. ద్యాప భాస్కర్‌రెడ్డి, బుడ్డా సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, పృథ్వీరాజ్, సతీష్‌రెడ్డి, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

ఆర్‌ఓ కార్యాలయాన్ని సందర్శించిన ఎన్నికల అబ్జర్వర్



కొత్తపేటలో డీసీపీ, ఏసీపీలతో మాట్లాడుతున్న ఎన్నికల అబ్జర్వర్ రామ్‌కుమార్ సధురప్పన్

చైతన్యపురి: తెలంగాణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రామ్‌కుమార్ సధురప్పన్ సోమవారం ఎల్‌బీనగర్ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. నామినేషన్ స్క్రూటిని వివరాలు, నియోజకవర్గంలో ఎన్నికల ఏర్పాట్లు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారి ఎస్. పంకజను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. అనంతరం ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, ఏసీపీ జానకిరెడ్డితో కలిసి నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో ఒకటైన శివగంగా కాలనీ ఎంఎస్‌వీఎన్ పాఠశాలను, చైతన్యపురి ఖజాన జ్యువెలర్స్ సమీపంలో పోలీస్‌లు ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్, కొత్తపేటలో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారాన్ని పరిశీలించారు.

రెండు వేర్వేరు ప్రాంతాల్లో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదంలో కాలిపోయిన షోరూమ్ రెండో అంతస్తు

గౌలిపురా: ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బజార్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకున్న ఘటన సోమవారం తెల్లవారుజామున మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..లాల్‌దర్వాజాలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో సోమవారం తెల్లవారుజామున ఆకస్మాతుగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ఫైరింజన్ల సాయంతో మంటలను ఆర్పివేశారు. ఈ సంఘటనలో రెండో అంతస్తులోని వాషింగ్ మెషిన్, ఫ్రిజ్, ల్యాప్‌టాప్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనలో షోరూమ్ కిందిభాగంలో ఉన్న కిరణ్ డయాగ్నోస్టిక్ సెంటర్ స్వల్పంగా ధ్వంసమైంది. దీనిపై నిర్వాహకుడు తమకు న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ ప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిందా..? లేదా బాణాసంచా పేల్చడంతో జరిగిందా..? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో..

డబీర్‌పురా: ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసుకున్న ఘటన మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాచకొండ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధి పత్తర్‌గట్టి ప్రాంతంలో ఫుట్‌వేర్‌కు చెందిన దాదాపు 15 షట్టర్లు కొనసాగుతున్నాయి. బబ్లూ సింగ్‌కు చెందిన నాలుగు ఆనంద్ ఫుట్‌వేర్ షాపులు, కిరణ్‌కు చెందిన రెండు ఆర్.కె.చెప్పల్ షాపులు, మహ్మద్ సోహేబ్‌కు చెందిన నాలుగు సఫారీ షూ షాపులు కొనసాగుతున్నాయి. ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు ఈ ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మొత్తం 10 షాపుల్లో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో చెప్పుల తయారీకి వినియోగించే వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి.

పూర్వీకుల సమాధుల వద్ద దీపావళి సందడి



చార్మినార్: పాతబస్తీలోని పలు ప్రాంతాల్లోని హిందూ శ్మశాన వాటికలు సోమవారం రాత్రి దీపావళి సందడితో కళకళలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు తమ సమయానుకూలంగా పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి పూలు, పండ్లు, దీపాలు ఏర్పాటు చేసి వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ శ్రద్ధాంజలి ఘటించారు. దీపావళి సందర్భంగా కొంతమంది తమ పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి దీపావళి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు..

చెత్తాచెదారంతో ఉండే శ్మశాన వాటికలలోని సమాధులు దీపావళి పండుగ సందర్భంగా క్లీన్‌గా కనిపించాయి. జోనల్ కమిషనర్ వెంకన్న ఆదేశాల మేరకు హిందూ శ్మశాన వాటికల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి నీట్‌గా చేశారు. అలాగే వీధిదీపాలతో పాటు అవసరమైన ఏర్పాట్లు చేశారు. దీంతో ఏడాది పొడవునా చెత్తాచెదారంతో కనిపించే హిందూ శ్మశాన వాటికలు శుభ్రంగా కనిపించాయి.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



మన్సూరాబాద్‌లో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి



గడ్డిఅన్నారం డివిజన్‌లో ఓటును అభ్యర్థిస్తున్న బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: నియోజకవర్గ అభివృద్ధికి కమలం పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించాలని బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి కోరారు. గడ్డిఅన్నారం డివిజన్‌లో కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి సామ రంగారెడ్డి సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో సుధీర్‌రెడ్డిని నమ్మి ఓట్లేస్తే, ఎల్‌బీనగర్ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసి ఆస్తులు కాపాడుకోవటానికి అధికార పార్టీలోకి ఫిరాయించడని దుయ్యబట్టారు. ఉద్యోగ నోటిఫికేషన్ల లీకేజీలతో తెలంగాణ యువత నానా ఇబ్బందులు పడుతున్న, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త, జాతీయ అవార్డు గ్రహీత నాగరత్నం నాయుడు, నాయకులు దాసరీ జయప్రకాష్, మాజీ కౌన్సిలర్ నిర్మల, మధుసూధన్‌రెడ్డి, శ్రీకాంత్, అమర్, రాఘవరెడ్డి, అభయ్, బాలరాజు, సత్యనారాయణ, రాంరెడ్డి, దశరథ, అనంతచారి, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లో..

ఎల్‌బీనగర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికులను బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సోమవారం మన్సూరాబాద్ కార్పొరేటర్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని భవన నిర్మాణ కార్మికులను వారు కోరారు. ఈ కార్యక్రమంలో మొరిశెట్టి సంతోష్‌కుమార్, కడారి యాదగిరి యాదవ్, గంగదాసు కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, హరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మి ఆలయాన్ని దర్శించుకున్న ప్రముఖులు



చార్మినార్: దీపావళిని పురస్కరించుకొని భాగ్యలక్ష్మి అమ్మవారిని పలువురు అధికార అనధికార ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్, దానం నాగేందర్, డాక్టర్ భగవాన్ రావు, మేయర్ విజయలక్ష్మి, జస్టిస్ అమర్నాథ్ గౌడ్, రామచంద్రారావు తదితరులు భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ ట్రస్ట్ శశికళ వీరికి స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.